క్లుప్తంగా

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రంజాన్ నెల ఆరంభం సందర్భంగా ముస్లింలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిన ఈ రంజాన్ మాసంలో.. నెల రోజులపాటు నియమ నిష్ఠలతో ముస్లింలు కఠిన ఉపవాస వ్రతం ఆచరించి అల్లాహ్ కృపకు పాత్రులవుతారని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం ఇచ్చే గొప్ప సందేశం అని అన్నారు. ముస్లింలు ఈ నెలలో అనేక దైవకార్యాలు చేస్తారని, ప్రతిరోజూ ఐదు సార్లు ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారని అన్నారు. మనిషిలోని చెడు భావాల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ అని ఆయన అన్నారు.

జాబ్‌ఫెస్ట్‌లో ప్రతిభ

వైవీయూ : రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌ఫెస్ట్–24లో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఈ ఫెస్ట్‌కు కళాశాల నుంచి పలువురు విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనగా 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ప్రతిభ కనబరిచిన 34 మంది విద్యార్థులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సర్పంచులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు నిధులు, విధులు ఇవ్వాలని కోరారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోకుండా కాపాడాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి కోరారు. అనంతరం 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, చింతా కిరణ్ యాదవ్, సింగంశెట్టి సుబ్బరామయ్య, సీజే కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా

కడప స్పోర్ట్స్: కడప నగరంలో ఈనెల 10వ తేదీన నిర్వహించిన 1వ రాయలసీమస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో డీఎస్ఏ జిమ్‌సెంటర్ క్రీడాకారుడు డి. సునీల్ మూడోస్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఆయన్ను డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి అభినందించారు. రాయలసీమ స్థాయిలో మూడోస్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. బాగా సాధన చేసి రాష్ట్ర స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. చక్కటి శిక్షణ ఇచ్చిన జిమ్ శిక్షకుడు నూర్‌ను డీఎస్‌డీఓ అభినందించారు.

సన్మానం

కడప రూరల్ : దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ నజీముద్దీన్‌ను మంగళవారం స్థానిక సంఘం దంత వైద్యశాలలో జీకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాష శాలువతో సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో తారిఖ్ అలీ, కలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ యత్నం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చు రగిల్చి మళ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తోందని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు కేసి బాదుల్లా ఆరోపించారు. మంగళవారం కడప నగరంలోని బళ్లారి రోడ్ అమీన్ పీర్ దర్గా సర్కిల్ వద్ద సీఏఏ బిల్లుకు సంబంధించిన ప్రతులను ఇన్సాఫ్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బాదుల్లా మాట్లాడుతూ సీఏఏ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గౌస్, నగర ఉపాధ్యక్షులు ఎస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షనిజాన్ని ఎమ్మెల్యే ప్రోత్సహిస్తున్నారనడం విడ్డూరం

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలిలో టీడీపీలోని పుత్తా, సాయి వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఫ్యాక్షనిజాన్ని ప్రోత్సహిస్తున్నారని టీడీపీ నాయకులు పేర్కొనడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, డీసీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు పాళెం సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం పెద్దచెప్పలిలో పుత్తా, సాయి వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, అయితే ఈ ఘర్షణకు ఎలాంటి సంబంధం లేని తమ పార్టీకి చెందిన జంబాపురం సర్పంచ్ ఇందిరెడ్డి శ్రీనువాసులరెడ్డి తన గ్రామానికి వెళ్తుండగా దారిలో కాపు కాచి అతనిపై టీడీపీ వర్గీయులు దాడి చేసి చావు దెబ్బలు కొట్టడం హేయమన్నారు. చికిత్స పొందుతున్న అతడిని పరామర్శించేందుకు ఎమ్మెల్యే రిమ్స్‌కు వెళ్లారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా టీడీపీ నాయకులు ఫ్యాక్షనిజాన్ని ఎమ్మెల్యే ప్రోత్సహిస్తున్నారని ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మహిళా కళాశాలలో పట్టాభిషేక వేడుక

మహిళా సాధికారతే ధ్యేయంగా జిల్లాలో ఏర్పాటైన ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మహిళల జీవితాల్లో వెలుగు నింపుతోంది. మహిళల విద్య అభ్యున్నతికి జిల్లాలో ఏర్పాటైన ఈ విద్యాలయంలో బుధవారం 2వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించనున్నారు.

• నేడు 2వ గ్రాడ్యుయేషన్ డే



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

వైవీయూ : కోటిరెడ్డి రామసుబ్బమ్మ చొరవతో 1973లో కోర్టు భవన సముదాయంలో జిల్లాలో మొట్టమొదటి మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేశారు. చాలా కాలం పాటు కోర్టు భవనాల్లో కళాశాల నిర్వహించారు. 3.5 ఎకరాల స్థలంలో ప్రస్తుత కళాశాల ఏర్పాటు చేశారు. అనంతరం ఇటీవల కాలంలో కోటిరెడ్డి, రామసుబ్బమ్మల తనయుడు ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జయభారత్‌రెడ్డి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం దాదాపు రూ.1 కోటి వెచ్చించి హాస్టల్‌సైతం అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. 2004లో జిల్లాకు చెందిన డా. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కళాశాల దశ మారింది. రూ.2.5 కోట్ల నిధులు విడుదల చేయడంతో పాటు స్వయాన ముఖ్యమంత్రిహోదాలో 2005లో ఆయనే శంకుస్థాపన చేశారు. 2008 నాటికి నూతన భవనాలు పూర్తయి కళాశాల సరికొత్త రూపును సంతరించుకుంది. అనంతరం 2014, 2024లో కళాశాల న్యాక్ బీ గ్రేడ్ సాధించడంతో పాటు స్వయంప్రతిపత్తి హోదాను సాధించింది.

2వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు..

ఇప్పటి వరకు డిగ్రీ, పీజీ సర్టిఫికెట్‌కు సంబంధించిన విశ్వవిద్యాలయాలే స్నాతకోత్సవాలు నిర్వహించి పట్టాలు ప్రదానోత్సవం చేసేవారు. అయితే కళాశాల విద్య కమిషనరేట్ ఆదేశాల మేరకు గతేడాది నుంచి స్వయంప్రతిపత్తి హోదా కలిగిన కళాశాలలు సైతం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో 2వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, గౌరవ అతిథిగా కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, కడప ఆర్‌జేడీ డా. పి.బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.సలీంబాషా విచ్చేసి కార్యక్రమంలో విద్యార్థులకు పట్టాలు ప్రదానోత్సవం చేయనున్నారు.



వేడుకలా గ్రాడ్యుయేషన్‌డే

2018–21 బ్యాచ్, 2019–22 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానోత్సవం చేసేందుకు 2వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం. విద్యార్థుల జీవితంలో మధుర ఘట్టం గ్రాడ్యుయేషన్ డే. విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– డాక్టర్ వేమల సలీంబాషా, ప్రిన్సిపాల్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

• రాహుకాల పూజలు


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : గ్రహ బాధల నుంచి తమను తప్పించాలని కోరుతూ మహిళా భక్తులు శ్రీ విజయదుర్గాదేవిని ప్రార్థించారు. కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై ఆందోళన

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని స్పెన్సర్స్ వెనుకవైపు ప్రాంతంలో ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుపై కొంతమంది స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ మంగళవారం ఆందోళన చేశారు. ఈ ప్రాంతంలో సర్వేనెంబర్187/1 లోని 20 సెంట్లు స్థలాన్ని జిల్లా కలెక్టర్ విజయరామరాజు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. అయితే బాధితులు ఈ ప్రాంతంలో తమకు గతంలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారని.. ఇక్కడ విద్యుత్ సబ్ స్టేషన్ ఎలా ఏర్పాటు చేస్తారని అభ్యంతం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేసేందుకు విద్యుత్ అధికారులు రాగా పట్టాలు పొందిన కొంతమంది అడ్డుకున్నారు. తమకు సంబంధించిన పునాదులు మట్టి కింద ఉన్నాయని, ఇటీవల మట్టి తోలడంతో అవి కనిపించడం లేదని అధికారులకు తెలియజేశారు. అధికారులు సమస్యను కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో చిన్నచౌకు పోలీసులు ఈ ప్రాంతానికి చేరుకుని సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని.. ఈ విధంగా అడ్డుకోవడం తగదన్నారు. దీంతో బాధితులు తమ ఆందోళన విరమించి సమస్యను కలెక్టర్‌కు వివరిస్తామన్నారు.


సమస్యను పోలీసులకు తెలియజేస్తున్న స్థానికులు

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ అన్నారు. అన్నమయ్య సర్కిల్– క్రిష్ణాసర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్– దేవుని కడప రోడ్డు, మాచుపల్లి సర్కిళ్లను పరిశీలించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద ఎలక్ట్రికల్ స్తంభాలను మార్పు చేయాలన్నారు. డ్రైనేజీ కాలువలపై స్లాబ్ వేయాలన్నారు. క్రిష్ణా సర్కిల్– పొట్టి శ్రీరాములు సర్కిల్ మార్గంలో రోడ్డు ప్రక్కన ఉన్న వ్యర్థాలను తక్షణమే తొలగించాలన్నారు. దేవుని కడప రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులలో వ్యర్థపు నీరును తక్షణమే తొలగించాలన్నారు. మాచుపల్లి సర్కిల్ వద్ద ఫ్లోరింగ్ పనులను క్రమ పద్ధతిలో పూర్తి చేయాలని, డ్రైనేజీ కనెక్షన్, తాగునీరు వెళ్లే పైపులైన్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తూ స్కేటింగ్ ట్రాక్ మధ్య ఖాళీ స్థలాలను అభివృద్ధి జరిగేలా ప్రణాళికలను రూపొందించాలన్నారు. క్రీడాకారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటలు ఆడుకునే సౌలభ్యం కల్పించాలన్నారు. స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నటువంటి గ్యాలరీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, హాకీ గ్రౌండ్‌నకు మార్కింగ్ ఇవ్వాలన్నారు. స్టేడియానికి వచ్చే ప్రజలకు, క్రీడాకారులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి, నగరపాలక, డీఎస్ఏ అధికారులు పాల్గొన్నారు.


నగరంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

'ఇఫ్తార్'తో భక్తి, మత సామరస్యం

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప కల్చరల్ : ఇఫ్తార్‌ల ద్వారా ముస్లిమేతరులలో కూడా దైవం పట్ల భక్తి కుదురుతుందని, మత సామరస్యం పెరుగుతుందని, ప్రజల మధ్య సోదరభావం, ఆత్మీయత పరిమళింపజేస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా అన్నారు. మంగళవారం సాయంత్రం కడప నగరంలోని అమీన్ పీర్ దర్గా ఆవరణలో రంజాన్ ఉపవాస మొదటి రోజు ఏర్పాటు చేసిన 'ఇఫ్తార్' కార్యక్రమానికి అంజాద్ బాషా హాజరై ప్రార్థనలు చేసి అల్పాహారం స్వీకరించి ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో విశ్వశాంతికి ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తామన్నారు. ఈ మాసంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యదాయకమని, అభినందనీయమని తెలిపారు. దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఆలవాలం అన్నారు. మనిషి సత్ప్రవర్తనతో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన, ప్రార్థనలు, మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంచుతాయన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశామని ఆయన తెలిపారు. అనంతరం అంజద్ బాష ఇతర భక్తులతో కలిసి నమాజు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు అఫ్జల్‌ఖాన్, షఫీ, దర్గా ప్రతినిధులు, నగర ముస్లిం ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష


ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లింలు

మోడల్ స్మశాన వాటికలు ప్రారంభం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిందూ, ముస్లిం, క్రిష్టియన్ మోడల్ స్మశాన వాటికలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సెంట్రల్ జైలు సమీపంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికల శిలాఫలకాలను ఆవిష్కరించి, ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ ఉపవాస మాసం ప్రారంభ మొదటి రోజున ఈ శ్మశాన వాటికలు ప్రారంభించామన్నారు. మొదటి నుంచి కడప ప్రజలు సాత్వికులని, కుల, మతాలతో సంబంధం లేకుండా సోదర భావంతో కలిసి మెలసి ఉంటున్నారన్నారు. కడప పెద్ద దర్గా, దేవుని కడప, మరియాపురం చర్చిలు కడప నగరానికి పేరుతెచ్చే ఆధ్యాత్మిక కట్టడాలు అన్నారు. ఇలాంటి మతసామరస్యం దేశంలో మరెక్కడా లేదన్నారు. ఈ భూలోకంలో జీవించి ఉన్నప్పుడు అందరూ సమానమేనని, మరణానంతరం కూడా అందరూ సమానమేననే భావనతో అన్ని మతాలకు చెందిన స్మశాన వాటికలను ఒకేచోట నిర్మించడం జరిగిందన్నారు. 10.30 ఎకరాలలో రూ.6 కోట్ల వ్యయంతో ఈ మోడల్ స్మశాన వాటికను నిర్మించామన్నారు. అప్పట్లో వైఎస్ఆర్ స్థలాన్ని కేటాయించారని, గుంతలమయమై ఉన్న ఈ స్థలంలో పెద్ద ఎత్తున మట్టి తోలి చదును చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ స్మశాన వాటికలను నిర్మించామన్నారు. హిందువుల కోసం హిందూ స్మశానవాటికలో క్రిమిటోరియంను ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఈ పరిసర ప్రాంతాలకు సంబంధించిన ప్రజలు స్మశాన వాటికలు లేక ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం అన్ని వసతులతో ఈ స్మశాన వాటికలను ఏర్పాటు చేశామన్నారు. తొలుత హిందూ, ముస్లిం, క్రైస్తవ మోడల్ స్మశాన వాటికల శిలాఫలకాలను ఆవిష్కరించి, ప్రార్థనలు జరిపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎం. సుబ్బారెడ్డి, బండి ప్రసాద్, ఆర్‌వీ రమణ, వీరారెడ్డి, ఎస్ సుబ్బారెడ్డి, షఫీ పాల్గొన్నారు.


హిందూ, ముస్లిం, క్రిష్టియన్ స్మశాన వాటికల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించుకోవాలి

చెన్నూరు : వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రెండవ రోజు రైతు శిక్షణ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఏ.వీరయ్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడానికి వివిధ పథకాల ద్వారా ఎంతో కృషి చేస్తు న్నాయని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి


కమలాపురం పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

కమలాపురం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పట్టణంతో పాటు పెద్దచెప్పలి తదితర గ్రామాలలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి మాట్లాడారు. ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం కల్పిస్తామని ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అభివృద్ధి–సంక్షేమ పథకాలు కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని కొత్తగంగిరెడ్డి, తువ్వపల్లె, అగ్రహారం, సోగాల్‌పల్లె గ్రామాలల్లో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా అమలు చేసి సంక్షేమ పథకాలు ప్రతి గడప చేరాలంటే జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీల ద్వారా లంచాలు తీసుకుని ఇచ్చేవారన్నారు.

తెలుగు తల్లికి మొల్ల రామాయణార్చన

నేడు మొల్లమాంబ జయంతి

కడప కల్చరల్ : మహిళలు ఇంటి గడప దాటడం మహా పాపమన్న ఆంక్షలు ఉన్న రోజుల్లోనే ఆమె కవయిత్రిగా పేరుగాంచి సమకాలీన పండితులను మెప్పించారు. తొలి తెలుగు రామాయణ రచయిత్రిగా తెలుగు జాతికి గర్వకారణంగా నిలిచారు. జిల్లాకు ఆ మహిళా మణి గర్వకారణం. ఈ ప్రత్యేకతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆమె జయంతిని ప్రభుత్వ పక్షాన నిర్వహించి గౌరవిస్తోంది.

రామాయణం రాస్తేనే పండితుడు అనిపించుకునే ఆ రోజుల్లో మహిళకు చదువు కూడదని, ఇల్లు దాటి బయటికి వెళ్లకూడదని ఆంక్షలు ఉన్న ఆరోజుల్లోనే ఆమె తన కవితా ప్రావీణ్యంతో సమకాలీన పండితులను, అగ్రవర్ణమని విర్రవీగే కవులను ఆశ్చర్య చకితులను చేశారు. 24 వేల సంస్కృత శ్లోకాలుగల మూల రామాయణాన్ని ఆమె 871 తెలుగు పద్య గద్యాలుగా క్లుప్తీకరించి సులభంగా అర్థమయ్యేలా తెలుగు జాతికి అపురూపమైన కానుకగా అందజేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో నాటి పండితులు సైతం ఆమె రచన గొప్పదని ఒప్పుకోక తప్పలేదు.

మొల్లమ్మపై భక్తితో..

ఆమె జన్మస్థలిపై వివాదమున్నా కవుల గడపగా భావించే మన జిల్లా సాహితీవేత్తలు ఆమెను తమ ఆడబిడ్డగా భావించి ఆమె జయంతిని ఘనంగా నిర్వహిస్తూ గౌరవిస్తున్నారు. వారం రోజులపాటు ఆమె జయంతిని జిల్లా నలుమూలల నిర్వహిస్తూ సాహితీవేత్తలకు పురస్కారాలు అందజేస్తున్నారు. మొల్ల సాహితీపీఠం ఏర్పాటు చేసిన సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఆమె విగ్రహాలను గోపవరంలోనూ, కడపలోనూ ఏర్పాటు చేశారు. గోపవరంలో ఆమె పేరిట హరిత టూరిజం హోటల్‌ను ప్రభుత్వం నిర్మించింది. ఆమె పేరిట తపాల బిళ్లను విడుదల చేయించడంతోపాటు ఆమె గురించిన పుస్తకాలను రాశారు. వీడియో సినిమా తీశారు. ఆమె రచించిన రామాయణాన్ని ఎక్కువ ప్రతులు ముద్రించి విశేష ప్రచారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా మొల్ల జయంతిని పురస్కరించుకుని హనుమంతరావు వారం నుంచి ఆమె పేరిట సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పక్షాన బుధవారం కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో స్పందన హాలులో ఉదయం 9 గంటలకు మొల్ల జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు వైవీయూలో ఆమె పేరిట ఏర్పాటు చేసిన హాలులో వీసీ చింతా సుధాకర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.


కడప నగరంలో మొల్లమాంబ విగ్రహం

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

కమలాపురం : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో సిబ్బంది ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి మీకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జేసీ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గణేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకర్గంలోని నోడల్, ఎక్స్‌పెండీచర్ తదితర విధులు నిర్వర్తించే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మీకు కేటాయించిన విధుల గురించి చెప్పాలని ప్రశ్నించడంతో సిబ్బంది నుంచి సరైన సమాధానం రాలేదు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన జేసీ మీ విధుల పట్ల అవగాహన పెంచుకుని రావాలన్నారు. మీకు ఇచ్చిన మెటీరియల్ చదివి మీ విధులు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. మీకు మినిమం ఐడియా అయినా ఉండాలని, బేసిక్స్ తెలుసుకుని రావాలన్నారు. నా మాట కఠినంగా ఉంటుందని, మీ మనోభావాలు దెబ్బతింటాయి అనుకుంటే ఇతర నియోజకవర్గాలకు వెళ్లవచ్చునన్నారు. తాను వీఆర్‌ఓ, వీఆర్ఏలతోనే ఎన్నికలు నిర్వహించానన్నారు. మీరంతా మీ విధుల పట్ల అవగాహన ఉంటేనే మీ విధులు సమర్థవంతంగా నిర్వర్తించ వచ్చన్నారు. అంతా కలసి కట్టుగా పని చేస్తేనే ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించ వచ్చన్నారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, శంకర్‌నాయక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌ఓ, జేసీ గణేష్‌కుమార్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

చెన్నూరు : మహిళలు అన్నిరంగాలలో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన నాలుగో విడత చేయూత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు అత్యున్నత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు ఏకమై వస్తున్నాయని వాటికి మహిళలే బుద్ధిచెబుతారన్నారు. మండలంలో నాలుగో విడత చేయూత పథకం ద్వారా 1761 మంది అక్కా చెల్లెమ్మలకు రూ.3,30,19000ల మెగా చెక్కును ఆయన మహిళలకు అందిచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ అధ్యక్షుడు పులిసునీల్‌కుమార్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, గణేష్ రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అల్లిశ్రీరామ మూర్తి, గుమ్మల్ల మధుసూదన్‌రెడ్డి, ఆర్ఎస్ఆర్, సర్పంచ్‌లు, ఏపీఎం గంగాధర్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులురెడ్డి